

3లో.

**డిఎస్‌సి ఫలితాల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు**


RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 254 శనివారం 28 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# హైదరాబాద్‌కు రాష్ట్రపతిముర్ము...

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు**

**నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముర్ము**

**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

**ఉదయం తొమ్మిది గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు**

**బేగంపేట నుంచి బొల్లారం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్న అడిషనల్ సీపీ**



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము (సెప్టెంబరు 28) హైదరాబాద్ రానున్నారు. నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.రాష్ట్రపతి రాక నేపథ్యంలో రేపు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈ మేరకు అదనపు సీపీ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ప్లాజా, టివోలీ, కారా?నా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. నిన్న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాల్స్‌ను పరిశీలించారు.

# పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు

**హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ**

**పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ ఒప్పందం**

**మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్న సిఎం రేవంత్**




హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణకు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు.

మిగతాది 2లో...



# మంత్రి పొంగులేటి నివాసాలపై ఇడి దాడులు

**పలుచోట్ల ఏక కాలంలో దాడులు**

**ఢిల్లీ నుంచి వచ్చిన బృందాలతో సోదాలు**



# మాది నిర్మాణమైతే... మీది విధ్వంసం

**అవి రాత్రికి రాత్రే పుట్టుకు వచ్చాయా?: కేటీఆర్**

**మూసీ నది సాక్షిగా లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామన్న కేటీఆర్**


**తాము నిర్మిస్తే... మీరు కూల్చివేస్తున్నారని విమర్శ**

**అధికారులు మీ టేబుల్ ముందు పెట్టిన డబుల్ లెక్కలు చూసి మతిపోతుందా? అన్న కేటీఆర్**

హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, మరి మూసీ నది సాక్షిగా హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాత్రికి రాత్రే పుట్టుకు వచ్చాయా చిట్టీ...! అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

మిగతాది 2లో...






# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు సీరియస్

హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు సీరియస్ అయింది. వచ్చే సోమవారం తప్పనిసరిగా కోర్టుకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. కోర్టులో పెండింగ్‌లో ఉన్న భవనాన్ని ఎలా కూలుస్తారని ప్రశ్నించింది. వచ్చే సోమవారం 10.30 గంలకు ఖచ్చితంగా న్యాయస్థానానికి హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగతంగా లేదా వర్చువల్ గా న్యాయస్థానంలో హాజరు కావాల్సి ఉందని పేర్కొంది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ భవనాలను కూల్చివేయడం ఏంటని ప్రశ్నించింది. అమీన్‌పూర్‌లో ఒక భవ నాన్ని కూల్చివేసిన ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. దీంతో హైడ్రా కమిషనర్ న్యాయస్థానానికి ఏం వివరణ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



# నా మతం సమానత్వం.. డిక్లరేషన్‌లో రాసుకోండి


- ఆలయానికి వెళుతుంటే అడ్డుకోవడం దుర్మార్గం
- హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదు
- లడ్డూ వివాదాన్ని తప్పుదోవ పట్టించే యత్నంలో డిక్లరేషన్
- మాజీ సిఎంకే ఇంతటి అవమానం జరిగితే సామాన్యుల గతేం
- తిరుమల పర్యటన రద్దు చేసుకున్న జగన్..

2లో.

# నిబంధనలను పాటించాల్సిందే

**మనోభావాలు దెబ్బతీస్తామంటే కుదరదు: చంద్రబాబు**

- తిరుమల పర్యటన రద్దు చేసుకున్న జగన్
- ప్రభుత్వం ఆంక్షలు పెడుతోందని ఆగ్రహం
- తిరుమలలో రూల్స్ అలా ఉన్నాయన్న సీఎం చంద్రబాబు
- అందుకే పాబ్లో ఎస్కాబార్ అనేది అంటూ వ్యంగ్యం
- బైబిల్ నాలుగ్గోడల మధ్య చదవడం ఎందుకు...
- బయటికొచ్చి కూడా చదవచ్చని హితవు



# నా మతం సమానత్వం.

అమరావతిసెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: నా మతమేమిటని అందరూ అడుగుతున్నారని..నా మతం మానవత్వ మని కావాలంటే డిక్లరేషన్‌లో రాసుకోవాలని జగన్ సవాల్ చేశారు. దేవుడి దగ్గరకు వెళ్తొంటే ఏ మతం అని అడుగుతారా అని ప్రశనించారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న తర్వాత జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా డిక్లరేషన్ అంశంపై స్పందించారు. తాను నాలుగు గోడుల మధ్య బైబిల్ చదువుతానని ప్రకటించారు. అందులో తప్పేముందన్నారు. బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తానని చెప్పారు. అలాగే ఇస్లాంనూ గౌరవిస్తానని.. సిక్కిజంను కూడా ఆచరిస్తానని చెప్పుకొచ్చారు. తన మతం మానవత్వమేనన్నారు. గతంలో తాను పదిహేను సార్లకుపైగా తిరుమల కొండపైకి వెళ్లి వచ్చానన్నారు. మాజీ ముఖ్యమంత్రికే ఈ పరిస్థితి వస్తే దళితుల పరిస్థితి ఏమిటని జగన్ ప్రశ్నించారు. హిందూ ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవడం కరెక్ట్' కాదన్నారు. తనను అడ్డుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి బీజేపీ నేతల్ని కూడా తీసుకు వచ్చారని ఆరోపించారు. పాదయాత్ర చేసిన తర్వాత నడుచుకుంటూ తిరుమలకు వెళ్లాలని.. ముఖ్యమంత్రిగా ఉంటూ పట్టు వస్త్రాలు సమర్పించానని జగన్ తెలిపారు. అలాంటి తనను అడ్డుకోవాలనుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తిరుమల ప్రసాదాలపై ఇలా దుష్ప్రారం చేయడం అపవిత్రత కాదా అని ప్రశ్నించారు. గతంలో అనేకసార్లు తిరుమల వెళ్లా.. ఈ విషయం అందరికీ తెలుసు. శ్రీవారి దర్శనం చేసుకున్నాకే నా పాదయాత్ర ప్రారంభించా. పాదయాత్ర పూర్తయ్యాక కూడా నడిచివెళ్లి స్వామివారిని దర్శించుకున్నా. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి ఐదుసార్లు వస్త్రాలు సమర్పించా. నా కులం, మతం గురించి ప్రజలందరికీ తెలుసు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడగడం సరికాదు. మాజీ సీఎంకే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగతావారి పరిస్థితి ఏంటి? మతం పేరుతో రాజకీయాలు చేయడం చాలా దౌర్భాగ్యం అని జగన్ ఆరోపించారు.

గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడుగుతారా అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో అన్యమతస్తులు శ్రీవారి దర్శనానికి వస్తే.. తమకు దేవదేవునిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వడం చాలా కాలంగా సంప్రదాయంగా ఉంది. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్లు ఇచ్చారు. అయితే ఆ తర్వాత రాజకీయ నేతలు మత పరమైన అంశాల్లో ఇలాంటి డిక్లరేషన్లు ఇవ్వడానికి సిద్ధపడటం లేదు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి కూడా అలాంటి డిక్లరేషన్ అడుగుతున్న కారణమంగానే తిరుమలకు వెళ్లుండా ఆగిపోయినట్లుగా తెలుస్తోంది. అప్పుడప్పుడు నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐ మైసూర్‌కు పంపిస్తారు. ఇప్పుడు నమూనాల పరీక్షకు మొదటిసారిగా గుజరాత్‌కు పంపారు. ఆవులు వెజిటబుల్స్ ఆయిల్స్ తిన్నా ఇలాంటి ఫలితాలు వస్తాయని చెప్పింది. ఈ విషయాలన్నీ నివేదిక డిస్‌క్లయిమర్స్‌లో రాశారు. గుజరాత్ నుంచి వచ్చిన నివేదికను తెదేపా కార్యాలయం రిలీజ్ చేసింది. రహస్య నివేదిక అయితే తెదేపా ఆఫీసు నుంచి ఎలా బయటకు వస్తుంది? ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిని వాడలేదని తితిదే ఈవో చెప్పారు. సెప్టెంబరు 22న తితిదే ఈవో ప్రభుత్వానికి లేఖ పంపారు. తితిదే ఈవో పలుమార్లు చెప్పినా వినకుండా సీఎం మళ్లీ అబద్దాలు చెప్పారు. రాజకీయంగా లబ్ది పొందేందుకే ఇలా అబద్దాలు ఆడుతున్నారు. తిరుమల ప్రసాదాలపై ఇలా దుష్ప్రారం చేయడం అపవిత్రత కాదా అని ప్రశ్నించారు. గతంలో అనేకసార్లు తిరుమల వెళ్లా.. ఈ విషయం అందరికీ తెలుసు. శ్రీవారి దర్శనం చేసుకున్నాకే నా పాదయాత్ర ప్రారంభించా. పాదయాత్ర పూర్తయ్యాక కూడా నడిచివెళ్లి స్వామివారిని దర్శించుకున్నా. బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి ఐదుసార్లు వస్త్రాలు సమర్పించా. నా కులం, మతం గురించి ప్రజలందరికీ తెలుసు. గుడికి వెళ్లే వ్యక్తిని ఏ మతం అని అడగడం సరికాదు. మాజీ సీఎంకే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగతావారి పరిస్థితి ఏంటి? మతం పేరుతో రాజకీయాలు చేయడం చాలా దౌర్భాగ్యం అని జగన్ ఆరోపించారు.

---------------------

# నిబంధనలను పాటించాల్సిందే

అమరావతి,:సెప్టెంబర్ 27, ప్రజా వినికిడి:తిరుమల పర్యటన రద్దు చేసుకున్న మాజీ సీఎం జగన్ మీడియా ఎదుట చేసిన వ్యాఖ్యలకు సీఎం చంద్రబాబు ప్రెస్ మీట్ పెట్టి బదులిచ్చారు. ఏ వ్యక్తి అయినా తిరుమల వచ్చి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తామంటే కుదరదు అని తేల్చి చెప్పారు. ఇష్టం లేకపోతే తిరుమల వెళ్లొద్దు... ఇష్టముంటే వెళ్లండి... వెళ్లినప్పుడు అక్కడి సంప్రదాయాలు పాటించి ఆలయంలోకి వెళ్లండి... అని స్పష్టం చేశారు. నన్ను అడగడానికి మీరెవరు? అంటే... అడుగుతున్నది నేను కాదు... తిరుమలలో రూల్స్ ఆ విధంగా ఉన్నాయి... ఆ రూల్స్ లో ఉన్నది పాటించి తీరాలి... అని ఉద్ఘాటించారు. "తిరుమల వెళ్లొద్దని జగన్ కు ఎవరూ చెప్పలేదు. తిరుమల వెళ్లొద్దని జగన్ కు ఎవరైనా నోటీసులు ఇచ్చారా? ర్యాలీలు, జనసమీకరణలు చేయవద్దని మాత్రమే చెప్పాం. తిరుమల వెళ్లినప్పుడు అక్కడి నియమనిబంధనలను, ఆగమశాస్త్ర ఆచార సంప్రదాయాలను పాటించాలని చెప్పాం. అలాంటివి పాటించకపోతే మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వస్తుంది. "తిరుమల వెళ్లొద్దని జగన్ కు ఎవరూ చెప్పలేదు. తిరుమల వెళ్లొద్దని జగన్ కు ఎవరైనా నోటీసులు ఇచ్చారా? ర్యాలీలు, జనసమీకరణలు చేయవద్దని మాత్రమే చెప్పాం. తిరుమల వెళ్లినప్పుడు అక్కడి నియమనిబంధనలను, ఆగమశాస్త్ర ఆచార సంప్రదాయాలను పాటించాలని చెప్పాం. అలాంటివి పాటించకపోతే మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వస్తుంది.ఇవాళ అతను మాట్లాడిన మాటలు చూస్తే... నేను వెళతాను అంటున్నాడు. నేను అనుభవంతో చెబుతున్నా... ఇలాంటి మాటలు కరెక్ట్ కాదు. ఇంతకుముందు కూడా వెళ్లాను... ఇప్పుడు కూడా అలాగే వెళతాను అంటున్నాడు... ఇంతకుముందు నిబంధనలు అతిక్రమించావు... ఇప్పుడు కూడా నిబంధనలు మళ్లీ అతిక్రమించాలా? ఇంతకుముందు మీరు చట్టాన్ని ధిక్కరించి, బెదిరించి ఆలయం లోపలికి వెళితే, అది శాశ్వత అధికారం అవుతుందా? చట్టాలను చేసే శాసనసభ్యులుగా మనం చేసిన శాసనాలనే మనం గౌరవించకపోతే, ప్రజలెందుకు గౌరవిస్తారు? దౌర్జన్యం చేస్తాం, రౌడీయిజం చేస్తాం అంటే కుదరదు. తాను నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతానని చెబుతున్నాడు. బయటికి వెళితే హిందూ మతాన్ని గౌరవిస్తానని కూడా చెబుతున్నాడు. గుడ్... గౌరవించడం అంటే ఏమిటి... ఆ ఆలయానికి వెళ్లినప్పుడు ఆ ఆలయ సంప్రదాయాలను పాటించడం, అక్కడుండే ఆచారాలను అమలు చేయడం, అక్కడి నియమనిబంధనలు ఉల్లంఘించకపోవడం. అలా కాకుండా... ఇప్పటిదాకా నన్నెవరు ఇలా అడగలేదు, ఇప్పుడెందుకు అడుతున్నారు అనడం సమంజసం కాదు. బైబిల్ చదువుతున్నావు అంటే దానిపై నీకు నమ్మకం ఉంది కాబట్టి. అందులో తప్పులేదు. బైబిల్ రూంలోనే ఎందుకు చదువుకోవాలి, బయట కూడా చదువుకోవచ్చు కదా! నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు... నేను సూటిగా అడుతున్నా... నమ్మకం ఉన్నప్పుడు చర్చికి ఎందుకు పోకూడదు? నాలుగ్గోడల మధ్యన చదువుకోవడం ఎందుకు? ప్రజలందరూ ఆలోచించాలి. నేను హిందువుని... వెంకటేశ్వరస్వామి వద్దకు వెళతాను. నేను బహిరంగంగానే పూజలు చేస్తాను. అలాగే చర్చికి వెళతాను... వాళ్ల నియమాలను, నిబంధనలను పాటిస్తాను. మసీదుకు వెళతాను... వాళ్ల ఆచారాలను గౌరవిస్తాను. సొంత మతాన్ని ఆచరిస్తాం... మత సామరస్యాన్ని కాపాడతాం. ఇందులో తప్పేమీ లేదే! అలాంటప్పుడు బైబిల్ ను లోపలే చదువుకోవడం ఎందుకు... బహిరంగంగానే చదువుకోవచ్చు కదా! లోపల కూర్చుని చదువుకోవడాన్ని నేను తప్పుబట్టడంలేదు. కానీ, లోపల మాత్రమే చేస్తాను, బయట మాత్రం చేయను, నాది మానవత్వం అని మాట్లాడుతున్నాడు. మతసామరస్యాన్ని కాపాడమంటే, మానవత్వం అంటావేంటి?

అందుకే పాబ్లో ఎస్కోబార్ అనేది. ఎస్కోబార్ అరాచకాలు బయటికి వస్తుంటే, ఇలాంటివి కూడా జరుగుతాయా అని ఆశ్చర్యం వేస్తుంది. ఎస్కోబార్ కు, ఇతడికి పోలికలు చూసుకోండి. ఇటీవల సంఘటనలన్నీ ఎస్కోబార్ తరహాలోనే ఉంటున్నాయి" అంటూ చంద్రబాబు విమర్శనాస్త్రాలు సంధించారు.

"ఇంకొక ఆయన మాట్లాడుతున్నాడు... అతడు ఆ పార్టీకి జనరల్ సెక్రటరీ అంట. అతనొక అడ్వొకేట్ (పొన్నవోలు). పంది మాంసం బంగారం... నెయ్యి రాగి అంటున్నాడు... బంగారం తీసుకువచ్చి రాగిలో కలుపుతారా అంటున్నాడు. మనోభావాలు అంటే లెక్కలేదా మీకు? ఈ విషయాన్ని కనీసం ఖండించారా మాజీ ముఖ్యమంత్రి గారూ? అతడు మీ పార్టీ జనరల్ సెక్రటరీ అవునా, కాదా? మీ వాళ్లు ఏం మాట్లాడినా మేం భరించాలా? మీకు బాధ్యత లేదా? ఈ విషయాలే నేను అడుగుతున్నా... ప్రజలను కూడా పరిగణనలోకి తీసుకోమని చెబుతున్నా. ఆలయాలను అపవిత్రం చేసే చర్యలను అడ్డుకునే బాధ్యత మేం తీసుకుంటాం... అందులో ఎలాంటి రాజీ లేదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

---

# మంత్రి పొంగులేటి నివాసాలపై ఇడి దాడులు



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఇన్ ఫ్రా కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది. ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న రైడ్స్ దానికి కొనసాగింపు అని తెలుస్తోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి చిన్న వయస్సులోనే బిలియనీర్‌గా మారారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ వ్యవహారాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హర్ష రెడ్డి పేరుతో రూ.1300 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇది చర్చానీయాంశం అవుతుంది. ఆ క్రమంలో వరసగా ఈడీ రైడ్స్ జరగడం చర్చకు దారితీస్తోంది.

# మాది నిర్మాణమైతే... మీది విధ్వంసం

(మొదటి పేజి తరువాయి)

బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామన్నారు. తాము నిర్మిస్తే మీరు కూల్చేస్తున్నారని విమర్శించారు. తమది నిర్మాణమైతే... మీది విధ్వంసమని మండిపడ్డారు.లక్షల నిర్మాణాలు మావి అయితే... లక్షల కూల్చివేతలు మీవని ధ్వజమెత్తారు. మూసీ నది సాక్షిగా మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్ళు ఇవేనని ఫోటోలను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ విష ప్రచారాలు, అబద్ధాలు చెబుతున్నారనడానికి ఇది మరో సాక్ష్యమన్నారు. తాము డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టలేదని మభ్యపెట్టారని, మరి లక్ష ఇళ్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు.

కాంగ్రెస్ పాలనలో మీ అధికారులే మీ టేబుల్ ముందు పెట్టిన ఇళ్ల లెక్కలు చూసి మతిపోతోందా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిజం... ఆయన హామీలు నిజం... ఆయన మాట నిజమని తెలిసి మింగుడు పడటం లేదా? అన్నారు.మీ జూటా మాటలు, కుట్రలకు... మీ దిమాక్ తక్కువ పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు ఈరోజు కేసీఆర్ గారి నిర్మాణాలే దిక్కయ్యాయన్నారు. కేసీఆర్ లక్ష డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు నిజం... కేటాయింపులు నిజమే అన్నారు. మీ నాలుకలు తాటి మట్టలు కాకుంటే మరోసారి అబద్ధాలు మాట్లాడవద్దని హితవు పలికారు.

# పర్యాటక ప్రాంతాలుగా చారిత్రక భవనాలు

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించు కోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు.

నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్దరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్దరించనున్నది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకుని వచ్చినట్లు సీఎం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# హైడ్రా భయంతో మహిళ ఆత్మహత్య

కూకట్ పల్లి సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: రామాలయం సమీపంలోని యాదవ బస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ (56) ఇంటి కిటికీ కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైడ్రా ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న నల్లచెరువు పరిధిలో పలు ఇండ్లు, షెడ్లను అధికారులు కూల్చివేసిన సంగతి తెలిసిందే. అయితే వాటికి ఎదురుగా ఉన్న తన రెండు ఇల్లులు, షెడ్డును అధికారులు కూల్చివేస్తారనే భయంతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# కొండా లక్ష్మణ్‌కు ఘనంగా నివాళి



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పలువురు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించచారు. చిత్రంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి ఉన్నారు. ఇదిలావుంటే ఆచార్యకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు నివాళి అర్పించారు. తొలిదశ ఉద్యమంలో ఆయనది కీలక భూమికి అని కొనియాడారు.

-----

## వరంగల్ భద్రకాళి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం




హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: వరంగల్ భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. దీంతో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానం చైర్మన్ శేషు, ఈవో శేషుభారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీ భద్రకాళీదేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానాన్ని అందజేసారు. ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

-------------

# సిఎం రేవంత్‌తో రోష్ని నాడార్ మల్హోత్రా భేటీ

## సిఎంను కలిసిన జపాన్ రాయబారి



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెస్‌సిఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో టెక్నాలజీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఫ్యూచర్ సిటీ నిర్మాణం, స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై సిఎం వివరించారు. అలాగే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని జపాన్ కాన్సుల్-జనరల్ టకాహషి మునియో మర్యాదపూర్వకంగా కలిసారు.

# చెస్ క్రీడాకరులకు సిఎం అభినందన

## అర్జున్, హారికలకు 25లక్షల చొప్పన నజరానా

హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త:
జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెస్ ఒలంపియాడ్ లో స్వర్ణపథకం సాధించిన తెలంగాణ ఆటగాళ్లు మర్యాదపూర్వకంగా కలిసారు. చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లను సిఎం రేవంత్ అభినందించారు. వారికి 25 లక్షల చొప్పున నగదు బహుమతనిని ప్రకటించారు. భారతదేశం తరపున మొదటిసారి స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లు అర్జున్ (హన్మకొండ), ద్రోణవల్లి హారిక (ఖమ్మం). ఇద్దరు ఆటగాళ్లకు చెరో రూ.25లక్షలు నగదు ప్రోత్సాహకం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని అభినందించారు. సెప్టెంబర్ 10 నుంచి 23 వరకు బుడా పెస్ట్, హాంగరీలో జరిగిన చెస్ ఒలంపియాడ్‌లో వీరు స్వర్ణపతకాలు సాధించారు.

# హైడ్రా కూల్చివేతకు భయపడవద్దు..

## కొత్తపేట డివిజన్ ప్రజలకు భరోసా ఇచ్చిన ఈటల..కార్పొరేటర్ పవన్..



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: కొత్తపేట డివిజన్ శత్యనగర్ జనప్రియ అపార్ట్మెంట్స్ లో హైడ్రా వచ్చి కూల్చివేస్తుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ వారికి భరోసా నివ్వడం జరిగింది.





## మంచినీళ్ళ చెరువును సందర్శించిన ఇరిగేషన్ అధికారులు



రాయపర్తి, సెప్టెంబర్ 27,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల శివారులోని మంచినీళ్ళ చెరువు సమీపంలో నెలకొల్పిన సత్యనారాయణ స్వామి హచరీస్ ఇరిగేషన్ అధికారులు శుక్రవారం సందర్శించారు. విషపూరితమైన వ్యర్థాలు చెరువులో కలుస్తున్నాయని గత కొంతకాలంగా రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ఆందోళన చేపట్టారు. ఎస్సారెస్పీ ఈఈ రమేష్ బాబు, డిఈ కిరణ్ కుమార్ మంచినీళ్ల చెరువును పరిశీలించారు. రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు పౌల్ట్రీ హచరీస్ నుండి చెరువులో కలిసే విషవ్యర్థాల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. దీంతో పరిరక్షణ కమిటీ సభ్యులు పరిష్కారం చూపెట్టాల్సిందిగా అధికారులను కోరారు.

# విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

## - జిల్లా డిసిఇబి సెక్రెటరీ గారే కృష్ణమూర్తి

రాయపర్తి, సెప్టెంబర్ 27,(జర్నలిస్ట్ వార్త): విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని జిల్లా డిసిఇబి సెక్రెటరీ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని రాయపర్తి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాలలైన పానిష్ తండా, గట్టికల్, జగన్నాథపల్లి కొత్త తండా పాఠశాలలను శుక్రవారం వారు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ సమయపాలన పాటించి, విద్యార్థులు జాగ్రత్తగా ఇంటికి చేరుకునే విధంగా సూచన చేయాలని అన్నారు.



విద్యార్థులు బాహ్యాపఠణం చేసే విధంగా జాగ్రత్తపడాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెలవు పై వెళ్ళినప్పుడు సంబంధిత కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు సమాచారం అందించి, అనుమతి తీసుకుని, సెలవుపై వెళ్ళాలన్నారు. రాత నైపుణ్యాలు పెంపొందించే విధంగా హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ చేయించాలని అన్నారు. జరగబోయేటు ఎస్ఏ -1 పరీక్షలకు సంబంధించిన పాఠ్యాంశాలు పూర్తి చేసి, విద్యార్థులను సంసిద్ధులు చేయాలని అన్నారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వే-2024 పరీక్షలకు సంసిద్ధులు చేయడంలో భాగంగా మ్యాస్ మోక్ టెస్ట్ 2 సంబంధించిన ప్రశ్న పత్రాలు ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ సెంటర్ నుంచి తీసుకొని నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాక పద్మావతి, రాజ్ కుమార్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, సిఆర్పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను గౌరవించుకోవడం

# మనందరి బాధ్యత

## -ఆడబిడ్డలకు శ్రీనివాస్ రెడ్డి బతుకమ్మ కానుక

**- మైలారం ఆడపచులకు చీరల పంపిణీ**

**- పురిటిగడ్డ మైలారంకు నేనేప్పుడూ సేవకుడినే**

**- ఎస్ఆర్ఆర్ అధినేత శ్రీనివాస్ రెడ్డి**



రాయపర్తి, సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త: ఆడపడుచులకు ఇష్టమైన పండుగ బతుకమ్మ పండుగకు పెద్దన్నలా మారి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మైలారం గ్రామంలో 700మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ..ఆడబిడ్డలంతా సంతోషంగా జరుపుకునే పండగ బతుకమ్మ..ఇలాంటి పండగ సందర్భంగా చీరలు పంపిణీ చేసి ఆడబిడ్డల సంతోషంలో పాలుపంచుకోవడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. మహిళలను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లుగా తాను ఎంత ఎదిగినా ఎన్ని పేరుప్రఖ్యాతులు సంపాదించినా నా పురిటిగడ్డ మైలారం కు ఎల్లప్పుడూ సేవకుడినేనని అన్నారు. ఈ కార్యక్రమంలో లేతాకుల మధుకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సంధి దేవేందర్ రెడ్డి, కోల సంపత్, సాయి కిరణ్ , మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి, సెప్టెంబర్ 27,(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ హను ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎస్డిఎఫ్ గ్రాంట్ నిధులతో మంజురైనా సీసీ రోడ్ల నిర్మాణ పనులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రీప్రియ, గ్రామ పార్టీ అధ్యక్షులు కందికట్ల యాకన్న, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు నాగేశ్వరరావు,ఎస్సీ సెల్ అధ్యక్షులు చిర్ర మల్లయ్య, మండల ముఖ్య నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, కందికట్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు

## డిపాజిట్ల సేకరణకు బ్యాంకుల కష్టాలు

**80 శాతానికి చేరిన రుణ-డిపాజిట్ల నిష్పత్తిఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ నివేదిక**




హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త:
రుణాలకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా డిపాజిట్లను సేకరించేందుకు బ్యాంకులు కష్టపడుతున్నాయి.గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.1,64,98,006 కోట్ల రుణాలను ఇచ్చాయి. ఇదే సమయంలో క్రెడిట్ టు డిపాజిట్ (సీ-డీ) నిష్పత్తి 75.8% నుంచి 80.3 శాతానికి చేరిందని ఇన్ఫోమెరిక్స్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది.
2024 ఏప్రిల్ ఆర్‌బీఐ బులెటిన్ ప్రకారం చూస్తే.. మార్చిలో సీడీఆర్ 95.94 శాతంగా ఉంది. 2024 మార్చి 8 నాటికి ఇది 92.95 శాతంగా నమోదయ్యింది. వాణిజ్య బ్యాంకుల రుణ వితరణ ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. అదే సమయంలో డిపాజిట్లలో మాత్రం ఆశించినంతగా వృద్ధి కనిపించడం లేదు. 2018-19 నుంచి ఇప్పటి వరకూ డిపాజిట్లతో పోలిస్తే రుణాల్లోనే అధిక వృద్ధి నమోదవుతోంది. బ్యాంకు డిపాజిట్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాలు అనేకం అందుబాటులోకి రావడంతోనే ఈ చిక్కులు ఎదురవుతున్నాయని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని అసంఘటిత రంగం నుంచి బ్యాంకు డిపాజిట్లలోకి నగదు రావడం లేదని తెలిపింది.
స్టాక్ మార్కెట్లోకి వస్తున్న 30 ఏళ్లలోపు పెట్టుబడిదారులు 2018-19లో 22.6 శాతంగా ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి 39.9 శాతానికి (జులై 31 నాటికి) చేరారు. యువ మదుపరులు ఈక్విటీ మార్కెట్లపైనే ఆసక్తి చూపిస్తున్నారని నివేదిక తెలిపింది. 30-39 ఏళ్ల మధ్య ఉన్నవారి సంఖ్య స్థిరంగా ఉండగా, 40 ఏళ్లకు పైబడిన వారి సంఖ్య కాస్త తగ్గిందని వెల్లడించింది.

## డిఎస్‌సి ఫలితాల కోసం అభ్యర్థుల ఎదురుచూపులు




హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త:
రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డిఎస్‌సి ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షలను నిర్వహించగా, ఆగస్టు 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అభ్యంతరాలను పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్ ద్వారా స్వీకరించింది. ఈ నెల 6వ తేదీన పాఠశాల విద్యాశాఖ తుది కీ ని విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే పరీక్షల తుది కీ ఖరారైన తర్వాత డిఎస్‌సి మార్కులకు%ొ% టెట్ మార్కులను కలిపి జిల్లాల వారీగా జనరల్ ర్యాంకు లిస్టు విడుదల చేస్తారు.తుది కీ ఖరారై దాదాపు 20 రోజులకుపైగా గడుస్తున్నా ఇప్పటివరకు డిఎస్‌సి జనరల్ ర్యాంకింగ్ జాబితా(జిఆర్ఎల్) విడుదల కాకపోవడం పట్ల అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే డిఎస్‌సి తుది కీ విడుదల చేసిన తర్వాత ఆన్‌లైన్ టెట్ మార్కుల సవరణకు అవకాశం కల్పించారు. ఈ గడువు కూడా ఈ నెల 13వ తేదీన ముగిసింది. తుది కీ విడుదల తర్వాత కూడా జిఆర్ఎల్ ఎందుకు ప్రకటించడం లేదో అధికారులు చెప్పడం లేదు. ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారన్న విషయం అధికారికంగా వెల్లడించాలని అభ్యర్థులు కోరుతుతూన్నారు.డిఎస్‌సి జిఆర్ఎల్ ప్రకటించిన తర్వాత జిల్లాల వారీగా రిజర్వేషన్ల ప్రకారం 1:3 నిష్పత్తిలో మెరిట్ జాబితాను వెల్లడిస్తారు. జిల్లా విద్యాధికారులు(డిఇఒ) ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మెరిట్ ఉన్న వారికి నియామక ఉత్తర్వులు జారీచేస్తారు. డిఎస్‌సి పరీక్షలకు మొత్తం 2,79,957 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,45,263(87.61 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,61,745 మందికి 1,37,872 (85.24 శాతం), సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జిటి) పోస్టులకు 88,005కి 81,053 (92.10 శాతం), లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు 18,211కు 16,092(88.36 శాతం), పిఇటి పోస్టులకు 11,996కు 10,246(85.41 శాతం) మంది హాజరయ్యారు. రాష్ట్రంలో తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో డిఎస్‌సి పరీక్ష నిర్వహించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త

**విద్యార్థులకు ఉచిత పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తామని వెల్లడి**

**కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని విజ్ఞప్తి**

**చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్టు కొనసాగుతుందని వెల్లడి**



హైదరాబాద్,సెప్టెంబర్ 27, జర్నలిస్ట్ వార్త:
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విద్యార్థులకు ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈరోజు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమానికి సంబంధించిన జీవోను జారీ చేసినట్లు వెల్లడించారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శినిని రూపొందించారు.తెలంగాణ దర్శిని పోస్టర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మన సంస్కృతికి చిహ్నంగా ఉన్న కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యావరణ రంగాన్ని కూడా ముందుకు తీసుకువెళతామన్నారు.గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నగరంలోని ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. అందులో శాసన మండలిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జూబ్లీహాలును కూడా పరిరక్షించాల్సి ఉందన్నారు. ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్‌కు తరలించి ప్రస్తుత భవనాన్ని పరిరక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్టు కొనసాగుతోందని, అలాగే హైకోర్టు భవనం, సిటీ కాలేజీ భవనం, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలన్నారు.

# ఢిల్లీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీ బీజేపీ కైవసం



115 ఓట్లతో బీజేపీ అభ్యర్థి గెలుపు, ఆప్ అభ్యర్థికి ఓట్లు నిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీకి ఖాళీ అయిన ఏకైక సీటును బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి సుందర్ సింగ్ 115 ఓట్లు గెలుచుకోగా, ఆమ్ ఆద్మీ పార్టీ పార్టీ అభ్యర్థికి ఒక్క ఓటు కూడా రాలేదు. 'ఆప్' అధిష్ఠానం నిర్ణయం మేరకు ఆ పార్టీ కౌన్సిలర్లు ఈ ఎన్నికలను బహిష్కరించగా, కాంగ్రెస్ సైతం ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. దీంతో పోటీ లేకుండానే బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. అడిషనల్ కమిషనర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు.

**ఏం జరిగింది?**

బీజేపీ నేత కమల్‌జిత్ షెరావత్ ఇటీవల వెస్ట్ ఢిల్లీ ఎంపీగా ఎన్నిక కావడంతో ఎంసీడీ స్టాండింగ్ కమిటీ సభ్యుని పదవికి ఖాళీ ఏర్పడింది. గత గురువారంనాడు జరిగిన ఎంసీడీ సమావేశంలో ఎంసీడీ స్టాండిగ్ కమిటీ ఎన్నికను అక్టోబర్ 5వ తేదీకి మేయర్ షెల్లీ ఒబెరాయ్ వాయిదా వేశారు. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ ఈ వాయిదాను తోసిపుచ్చుతూ శుక్రవారం ఒంటిగంటకు ఎన్నికలు నిర్వహించాలంటూ ఎంసీడీ కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ గురువారం అర్ధరాత్రి ఆదేశాలు జారీ చేశారు. కమిటీ ఆరో సీటు ఎన్నికకు ప్రిసైడ్ చేయాలని అడిషనల్ మునిసిపల్ కమిషనర్ జితేంద్ర యాదవ్‌ను ఆదేశించారు. అయితే, ఇంత స్వల్ప వ్యవధిలో ఎన్నికకు ఆదేశాలివ్వడం చట్టవిరుద్ధమని, షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 5న ఎన్నికలు జరపాలని మేయర్ ఒబెరాయ్ డిమాండ్ చేసారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అయితే, ఎల్జీ ఆదేశాలకే కట్టుబడి స్టాండింగ్ కమిటీ సభ్యుని ఎన్నికను కమిషనర్ చేపట్టడంతో ఓటింగ్‌కు 'ఆప్' కౌన్సిలర్లు దూరంగా ఉండిపోయారు. తాజా ఎన్నికతో ఎంసీడీలోని 18 మంది సభ్యుల స్టాడింగ్ కమిటిలో బీజేపీ బలం10కి చేరింది. ఆప్‌కు 8 సీట్ల బలం ఉంది.

# భారత్‌కు బిగ్ బూస్ట్



ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్‌సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు. అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్‌సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్‌సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు. కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది. మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం అభ్యంతరం వ్యక్తం చేసినా సరే ఆ నిర్ణయం వీగిపోతుంది. శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఐదింటిలో నాలుగు మద్దతు ఇస్తున్నా.. చైనా మాత్రం భారత్ ప్రయత్నాలకు అడ్డుపడుతోంది.

# ఆ ఐదు రాష్ట్రాలే ... దేశాభివృద్ధికి కీలకం



**న్యూఢిల్లీ :** ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని అంటున్నారు ప్రధాని మోదీ. ఈమేరకు ఆయన చర్యలు కూడా చేపడుతున్నారు. అయితే దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని పలు రాష్ట్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దేశ తలసరి ఆదాయాన్ని మించి ఆ రాష్ట్రాల తలసరి ఆదాయం ఉంది. దీంతో దేశ జీడీపీ వృద్ధిలో కూడా ఆ రాష్ట్రాలే కీలకంగా మారాయి. గతంలో దేశ ఆర్థికాభివృద్ధిలో మహారాష్ట్ర కీలకంగా ఉండేది. కానీ ఇటీవల ఆ దేశ తలసరి ఆదాయం క్రమంగా తగ్గుతోంది. దీంతో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. దేశ జీడీపీలో 30 శాతం వాటా ఈ రాష్ట్రాలే కలిగి ఉన్నాయి. 1991 నాటి జాతీయ సగటుకన్నా ఎక్కువ. ఇక మహారాష్ట్ర వాటా 15 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గింది.తలసరి ఆదాయంలో తెలంగాణ, ఢిల్లీ, హర్యాన దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. అత్యంత సంపన్న రాష్ట్రాలుగా నిలిచాయి. బిహార్, ఉత్తర ప్రదేశ్ అత్యల్ప జీడీపీతో చివరిస్థానంలో ఉన్నాయి. దీంతో దక్షిణాది రాష్ట్రాలే దేశ జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇక ప్రాంతీయ అసమానతలు పశ్చిమ బెంగాల్ వంటి పేద రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు దక్షిణాదిలో గణనీయమైన ఆర్థిక పురోగమనాన్ని సాధించాయి.2021, సెప్టెంబర్ 25న విడుదల చేసిన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం.. జాతీయ సగటులో తలసరి ఆదాయం ఆధారంగా అత్యంత ధనిక రాష్ట్రాలుగా ఐదు రాష్ట్రాలు గుర్తింపు పొందాయి. 2014లో ఏర్పడిన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే ధనిక రాష్ట్రాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీ, హర్యానా రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్ర, భారతదేశ జీడీపీలో కీలక కంట్రిబ్యూటర్‌గా మిగిలిపోయినప్పటికీ, తలసరి ఆదాయంలో మొదటి ఐదు స్థానాల్లో స్థానం పొందలేదు.

తెలంగాణ: 176.8%, ఢిల్లీ: 167.5%, హర్యానా: 176.8%, మహారాష్ట్ర: 150.7%, ఉత్తరాఖండ్: 145.5%

**తలసరి ఆదాయం ప్రకారం పేద రాష్ట్రాలు**

తలసరి ఆదాయం ప్రకారం భారతదేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలుగా ఉన్నప్పటికీ, జాతీయ సగటులో వరుసగా 43.8% మరియు 39.2% వద్ద అత్యల్ప తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి.

బీహార్: 39.2%ఉత్తరప్రదేశ్: 43.8%, మధ్యప్రదేశ్: 46.1%, రాజస్థాన్: 51.6%, ఛత్తీస్‌గఢ్: 52.3%

ఐదు దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ మరియు తమిళనాడులు మార్చి 2024 నాటికి భారతదేశ జీడీపీలో 30% వాటాను కలిగి ఉన్నాయి, ఇది 1991లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, ఒకప్పుడు 1960?61లో జీడీపీలో 10.5% వాటాను కలిగి ఉంది, ప్రస్తుతం స్థిరమైన క్షీణత కేవలం 5.6%కి చేరుకుంది. దాని తలసరి ఆదాయం కూడా జాతీయ సగటులో 127.5% నుంచి 83.7%కి పడిపోయింది, ఇది రాజస్థాన్, ఒడిశా వంటి రాష్ట్రాల కంటే తక్కువ. ఉత్తరప్రదేశ్ వాటా 1960?61లో 14% నుంచి 9.5%కి పడిపోయింది. బీహార్ మూడవ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా ఉన్నప్పటికీ 4.3% మాత్రమే అందించింది.

# మోదీతో ఎంకే స్టాలిన్ 45 నిమిషాలు భేటీ



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని డీఎంకే అధ్యక్షుడు, తమళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారంనాడు ఢిల్లీలో కలుసుకున్నారు. 'సమగ్ర శిక్షా స్కీమ్' కింద కేంద్ర నిధులు విడుదల చేయాలని, 50:50 ఈక్విటీ షేర్ కింద చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్-2కు అనుమతి ఇవ్వాలని ప్రధానిని ఆయన కోరారు. భారత మత్స్యకారులకు సంప్రదాయంగా ఉన్న చేపటవేట హక్కులను పరిరక్షించాలని, సముద్ర జలాల్లో పట్టుకున్న తమిళ మత్స్యకారులు, వారి పడవలను త్వరితగతిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రధానికి స్టాలిన్ అందజేశారు. సుమారు 45 నిమిషాల పాటు ఉభయులూ భేటీ అయ్యారు. ప్రధానితో భేటీ అనంతరం మీడియాతో స్టాలిన్ మాట్లాడుతూ, సహజంగా ఇలాంటి సమావేశాలకు 15 నిమిషాలు సమయం ఇస్తారని, అయితే ఈసారి ఉభయులూ 45 నిమిషాల పాటు మాట్లాడుకున్నామని చెప్పారు. ఒక ముఖ్యమంత్రిగా తాను ఆయనను కలుసుకున్నానని, ప్రధానిగా ఆయన తమ వినతులను ఆలకించారని చెప్పారు. ప్రధానంగా ప్రధానికి మూడు వినతులు చేసినట్టు చెప్పారు. చెన్నై మెట్రోను ఏవిధంగా అయితే కేంద్రం, రాష్ట్రం కలిసి అమలు చేసిందో అదే విధంగా రెండో విడత కూడా అమలు చేయాలని తాము కోరుకుంటున్నామని, అదే విషయాన్ని ప్రధానికి వివరించానని సీఎం చెప్పారు. 2021-22 బడ్జెట్‌లో చెన్నై రైల్ ఫేస్-2 ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారని, 2022లో కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇంతవరకూ, 18,564 కోట్లను పనుల కోసం వెచ్చించామని, అయితే తమిళనాడు కేంద్ర మంత్రి నుంచి అనుమతి పెండింగ్‌లో ఉన్నందున కేంద్రం నుంచి నిధులు తమకు రాలేదని చెప్పారు. దీంతో మెట్రో రైల్ ప్రాజెక్టు నత్తనడక నడుస్తోందని చెప్పారు. ఆ కారణంగా ఎలాంటి జాప్యం లేకుండా నిధులు విడుదల చేయాలని ప్రధానిని కోరినట్టు చెప్పారు. తమిళ మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలని, సమగ్ర శిక్షా పథకం కింద కేంద్ర నిధులను తమిళ నాడుకు విడుదల చేయాలని కూడా కోరినట్టు తెలిపారు.

## కేరళలో రెండో మంకీ పాక్స్ కేసు నమోదు...



కేరళలో మరో మంకీ పాక్స్ కేసు నమోదైంది. ఇటీవల విదేశాల నుంచి ఎర్నాకులం తిరిగి వచ్చిన వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ అయింది. ఈ మేరకు కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. అతడి నమూనాలను పరీక్షలకు పంపించగా పాజిటివ్‌గా తేలిందని తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపింది. కేరళలో ఇది రెండో కేసు. భారత దేశంలో మాత్రం ఇది మూడో కేసు. సెప్టెంబర్ 9న తొలి మంకీ పాక్స్ కేసు నమోదయింది. అంతకుముందు, సెప్టెంబర్ 18న యూఏఈ నుంచి మలప్పురానికి వచ్చిన వ్యక్తికి మంకీ పాక్స్ నిర్ధారణ అయినట్టు ఆరోగ్య శాఖ ధృవీకరించింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే... 122 దేశాల్లో 99,518 మంకీ పాక్స్ కేసులు నమోదయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. మంకీ పాక్స్ ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా వ్యాపిస్తుండటంతో అక్కడ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించారు.ఈ నేపథ్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మన దేశంలో పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

## ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కొరడా



**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ కొరడా ఝులిపించింది. 13 మంది నాయకులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఆరేళ్ల పాటు పార్టీ నుంచి వారిని బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వచ్చినట్టు ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు పోటీగా ఈ 13 మంది నేతలు ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగడంతో కాంగ్రెస్ ఈ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. పార్టీ బహిష్కరణ వేటు పడిన ప్రముఖ నేతల్లో గల్బా ఎస్సీ నియోజకవర్గానికి చెందిన నరేష్ ధాండే, జింద్ నుంచి ప్రదీప్ దిల్, పుంద్రి నుంచి సజ్జన్ సింగ్, పానిపట్ రూరల్ నుంచి విజయ్ జైన్ తదితరులు ఉన్నారు. తిరుగుబాటు నేతలను పార్టీ నుంచి బహిష్కరిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ఉదయ్ భాను ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల్లో ఐక్యత, క్రమశిక్షణకు పార్టీ కట్టుబడి ఉందనే సంకేతాలిచ్చారు. తొలుత టిక్కెట్ల కేటాయింపుల విషయంలో పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో పార్టీ అధిష్టానం వారికి నచ్చచెప్పింది. అయినప్పటికీ కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో అది 13 మంది పార్టీ నేతల బహిష్కరణకు దారితీసింది. పార్టీ అదేశాలతో సీనియర్ నేత, మాజీ మంత్రి సంపత్ సింగ్ నల్వా సీటు నుంచి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బవానీ ఖెర సెగ్మంట్ నుంచి పోటీని రామ్ కిష్ ఫౌజి విరమించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జస్బీర్ మలౌర్ సైతం పోటీ నుంచి తప్పుకున్నారు. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 8న ఫలితాలు వెలువడతాయి.

## తిరుపతి లడ్డూ కల్తీ వివాదం వేళ..
## అయోధ్య రామ మందిరం కీలక నిర్ణయం



భక్తులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం వేళ అయోధ్య రామ మందిరం నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బాల రాముడికి బయటి సంస్థలు తయారుచేసిన ప్రసాదాలను నైవేద్యంగా పెట్టడంపై నిషేధం విధించారు. ఆలయ పూజారుల సమక్షంలో తయారుచేసిన ప్రసాదాలనే బాలరాముడికి నైవేద్యంగా పెట్టాలని, భక్తులకు ప్రసాదంగా అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు ఉపయోగించారన్న ఆరోపణలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ లడ్డూ కల్తీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో ఆలయాల్లో పెట్టే ప్రసాదం స్వచ్ఛతపై భక్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య ఆలయ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి స్వచ్ఛతపై రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అనుమానం వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలు, మఠాల్లో బయట ఏజెన్సీలు తయారు చేసిన ప్రసాదాలను పూర్తిగా నిషేధించాలి. దేవుళ్లకు ప్రసాదం ఆలయ అర్చకుల పర్యవేక్షణలోనే తయారు చేయాలి. అటువంటి ప్రసాదాన్ని మాత్రమే సమర్పించాలి' అని ఆయన అన్నారు. అదే సమయంలో తిరుపతి బాలాజీ లడ్డూ ప్రసాదంలో కొవ్వు, మాంసాహారం వినియోగిస్తున్నారనే ఆరోపణలపై దేశవ్యాప్తంగా వివాదాలు తీవ్రమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా భక్తులు, సాధుసన్యాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్లో అమ్ముతున్న నూనె, నెయ్యిల నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## ఛఠ్ పూజ, దీపావళి నేపథ్యంలో రైల్వే కోచ్‌లు పెంపు

రైలు ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త చెప్పారు. ఛఠ్ పూజ దీపావళి నేపథ్యంలో రైల్వే కోచ్‌ల సంఖ్యను పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 12,500 కోచ్‌లు అదనంగా జత చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. 'ఈ పండుగ సీజన్‌లో 108 రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను పెంచాం. ఛఠ్ పూజ, దీపావళి ప్రత్యేక రైళ్లకు 12,500 కోచ్‌లు అదనంగా జత చేశాం. 2024-25లో పండగ వేళల్లో ఇప్పటి వరకూ మొత్తం 5,975 రైళ్లను నడపనున్నట్లు ప్రకటించాం. ఈ నిర్ణయం దాదాపు కోటి మందికిపైగా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఈజీగా తమ గమ్యస్థానాలను కోరుకొనేందుకు సాయపడుతుంది. 2023-24లో పండుగల సీజన్‌లో 4,429 ప్రత్యేక రైళ్లను నడిపించాం' అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కాగా, దసరా, దీపావళి, ఛట్ పూజ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఇప్పటికే ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 12 వరకు ప్రయాణికులకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. కాగా, ఏటా ప్రత్యేక సందర్భాల్లో రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతుందన్న విషయం తెలిసిందే. దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పెద్ద పెద్ద పండగల దృష్ట్యా ఆయా మార్గాల్లో రైళ్లను నడుపుతుంటుంది. ఇక ఛఠ్ పూజ సమయంలోనూ రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. ఉత్తర భారతీయులు ఛఠ్ పూజను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటారు.



# దేవర విడుదలతో ఎన్టీఆర్ జోష్

## అభిమానులకు ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్, సైఫ్అలీఖాన్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈనేపథ్యంలోనే 'దేవర' రిలీజ్‌ను పురస్కరించుకొని సినీ ప్రియులు, అభిమానులను ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. తాను ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రోజు వచ్చిందని పేర్కొన్నారు. అభిమానులు చూపించే ప్రేమకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. మా సినిమాపై మీరు చూపిస్తోన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన డ్రామా, భావోద్వేగాలతో 'దేవర' తీర్చిదిద్దినందుకు థ్యాంక్యూ కొరటాల శివ. మై బ్రదర్ అనిరుధ్.. నీ మ్యూజిక్‌తో మా ప్రపంచానికి ప్రాణం పోశావు. ఈ చిత్రానికి బలమైన సపోర్ట్‌గా నిలిచిన మా నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, అద్భుతంగా వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సాబు సిరిల్‌తోపాటు టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు. నా అభిమానుల వేడుకలు చూసి నా మనసు నిండింది. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా. నాలానే మీరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేయడం చూస్తుంటే సంతోషంగా ఉంది. మీకు మరెంతో వినోదాన్ని అందిస్తానని మాటిస్తున్నా అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

# ఇందుగా సాయి పల్లవి..

హీరోయిన్ సాయి పల్లవి వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. నాన్ స్టాప్ గా షూటింగ్స్ లో పాల్గొంటోంది. కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ తో అమరన్ మూవీ చేస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న అమరన్ లో ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. నిజ జీవిత ఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఆ మూవీని కమల్ హాసన్ కు చెందిన సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఇప్పటికే అమరన్ మూవీ నుంచి హీరో శివ కార్తికేయన్ లుక్ తోపాటు సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా సినిమాలోని ఎక్కువ పార్ట్ కాశ్మీర్ లో షూట్ చేసినట్లు మేకర్స్ తెలిపారు. షూటింగ్ లొకేషన్ లో సాయి పల్లవి, శివ కార్తికేయన్ దిగిన పిక్స్.. మూవీ లవర్స్ ను ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఇండిపెండెన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన మేకింగ్ వీడియోలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. తాజాగా మేకర్స్ మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. సాయి పల్లవి ఇంట్రో వీడియోను రిలీజ్ చేశారు. ఇందు రెబెక్కా వర్గీస్ గా నేచురల్ బ్యూటీ సినిమాలో కనిపించనున్నట్లు వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ ఆఫీసర్ ముకుంద్ వరదరాజన్ గా శివకార్తికేయన్ యాక్ట్ చేస్తుండగా.. ఆయన భార్యగా సాయి పల్లవి నటిస్తోంది. లేటెస్ట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన సాయి పల్లవి గ్లింప్స్.. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో ఫుల్ వైరల్ అవుతోంది. సాయి పల్లవి పాల్గొనే రిపబ్లిక్ డే పరేడ్ తో ప్రోమో ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఫైల్ ఫుటేజ్ చూపించారు మేకర్స్. మేజర్ ముకుంద్ వీర మరణానంతరం భార్య ఇందు (సాయి పల్లవి)కి కేంద్ర ప్రభుత్వం పురస్కారం అందజేసే సన్నివేశాలను యాడ్ చేశారు. ముకుంద్, ఇందు మధ్య ప్రేమ, పెళ్లి, కుటుంబానికి సంబంధించిన సీన్స్ తో గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. గ్లింప్స్ చూశాక.. సాయిపల్లవి ఇందు రెబెకా వర్గీస్ పాత్రలో జీవించేసినట్టు క్లియర్ గా అర్థమవుతోంది. తన యాక్టింగ్ తో ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుందనేలా కనిపిస్తోంది. శివకార్తికేయన్ తో ఆమె కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. మొత్తానికి సాయి పల్లవి ఫ్యాన్స్ కు మేకర్స్ బ్యూటిఫుల్ ట్రీట్ ఇచ్చారనే చెప్పాలి. దీపావళి కానుకగా అక్టోబర్ 31వ తేదీ రిలీజ్ కానున్న అమరన్ మూవీతో నేచురల్ బ్యూటీ ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.





# బుట్ట బొమ్మ మరీ ఇంత సైలెంట్ గానా..?

రెండేళ్ల క్రితం తెలుగులో స్టార్ సినిమా అంటే చాలు ఫస్ట్ పూజా హెగ్దే దగ్గరకు వెళ్లాకే ఆ నెక్స్ట్ వేరే హీరోయిన్ దగ్గరకు వెళ్లే పరిస్థితి కనిపించింది. ఐతే ఆ ఇయర్ చేసిన సినిమాలన్నీ నిరాశపరచడంతో పూజాని లైట్ తీసుకున్నారు మన మేకర్స్. మహేష్ గుంటూరు కారంలో కొంత పార్ట్ షూట్ లో పాల్గొన్నా కొన్ని కారణాల వల్ల ఆ సినిమా నుంచి తప్పుకుంది అమ్మడు. అప్పటి నుంచి పూజా హెగ్దే ఖాతాలో ఒక్క తెలుగు సినిమా పడలేదు. తనకు స్టార్ డం ఇచ్చిన టాలీవుడ్ మీద అమ్మడు ప్రేమ చూపిస్తున్నా ఇక్కడ మాత్రం ఆమెను అసలు ఎవరు పట్టించుకోవట్లేదు.అందుకే తనకు అవకాశం ఇస్తున్న బాలీవుడ్, కోలీవుడ్ సినిమాలనే చేస్తూ వస్తుంది అమ్మడు. ప్రస్తుతం తమిళ్ లో సూర్య హీరోగా చేస్తున్న సినిమాలో పూజా హెగ్దే హీరోయిన్ గా నటిస్తుంది. సూర్య 44వ సినిమాగా వస్తున్న ఈ సినిమాను కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమాలో సూర్య గ్యాంగ్ స్టర్ గా కనిపించనున్నారు. కార్తీ వింటేజ్ లుక్ తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచింది. ఐతే ఈమధ్యనే షూటింగ్ మొదలు పెట్టిన ఈ సినిమాలో తన పోర్షన్ కంప్లీట్ చేసిందట పూజా హెగ్దే. ఇంత సైలెంట్ గా షూటింగ్ అయిపోవడం ఏంటని ఆడియన్స్ ఆశ్చర్యపడుతున్నారు. పూజా హెగ్దే పోర్షన్ అంతా పూర్తి చేసి ఆమెకు చిత్ర యూనిట్ గుడ్ బై చెప్పేశారట. సూర్య 44 తో పాటు హిందీలో ఒక సినిమా చేస్తున్న పూజా హెగ్దే ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. విజయ్ తో బీస్ట్ సినిమా చేసిన పూజా హెగ్దే ఆ తర్వాత మరో ఛాన్స్ అందుకోలేదు. మళ్లీ సూర్య 44 లో అవకాశం దక్కించుకుంది. సూర్య 44 సినిమా ఒక మంచి కమర్షియల్ ఎంటర్టైనర్ గా వస్తుందని తెలుస్తుంది. తప్పకుండా ఈ సినిమా సూర్య ఫ్యాన్స్ తో పాటు కామన్ ఆడియన్స్ కు నచ్చేస్తుందని అంటున్నారు. కోలీవుడ్ లో తీస్తున్న సరే సూర్య 44 సినిమాను తెలుగులో కూడా రిలీజ్ చేసే ప్లాన్ లో ఉన్నారు. కుదిరితే ఈ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ కూడా చేయాలని మేకర్స్ ట్రై చేస్తున్నారు. సో బాలీవుడ్ లో పూజా క్రేజ్ సూర్య 44 సినిమాకు కలిసి వస్తుందని చెప్పొచ్చు.


# డైరెక్టర్‌కు అస్వస్థత

## రకుల్ హిందీ షూటింగ్ రద్దు



కెరటం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది ఢిల్లీ భామ రకుల్ ప్రీత్ సింగ్. హీరోయిన్‌గా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో టాలీవుడ్‌లో మంచి బ్రేక్ అందుకుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగిన ఈ భామ తెలుగు సినిమాలో కనిపించక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం హిందీ ప్రాజెక్టులపైనే ఫోకస్ పెట్టింది. ఈ భామ అజయ్ దేవ్‌గన్, టబు ప్రధాన పాత్రలు పోషిస్తున్న దే దే ప్యార్ దే 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్ర షూటింగ్ కొన్ని రోజులుగా పాటియాలో జరుగుతుంది. అయితే అనుకోకుండా సినిమా షూటింగ్ రద్దయినట్టు ఓ వార్త బయటకు వచ్చింది. తాజా టాక్ ప్రకారం మూడీ డైరెక్టర్ అన్షుల్ శర్మ అస్వస్థతకు లోనవడంతో రెండు రోజులపాటు చిత్రీకరణ నిలిపేసినట్టు తెలుస్తోంది. అన్షుల్ వర్మ డెంగ్యూ అని నిర్ధారణ కాగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. అన్షుల్ శర్మ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సినిమా మరో నెలపాటు వాయిదా వేసినట్టు తెలుస్తోంది. దే దే ప్యార్ దే 2 షూటింగ్ మళ్లీ నవంబర్‌లో మొదలు కానున్నట్టు ఇన్‌సైడ్ టాక్. రకుల్ ప్రీత్ సింగ్ వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 3 పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

# మరోసారి రామాయణం కథలో ప్రభాస్..?



రామాయణం ఆధారంగా ఇప్పటి వరకు ఎన్నో సినిమాలు, సీరియల్స్ వచ్చాయి. ఎన్ని వచ్చిన మళ్ళీ మళ్ళీ శ్రీరాముడి చరిత్రని చూడటానికి ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. అందుకే రామాయణం ఆధారంగా ఇప్పటికి మూవీస్ చేయడానికి మేకర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. రామాయణం కథకి తన కల్పన జోడించి బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ 'ఆదిపురుష్' మూవీ చేశారు. ఈ సినిమాలో శ్రీరాముడిగా ప్రభాస్ నటించాడు. ఆ పాత్రలో ప్రభాస్ ని ప్రెజెంట్ చేసిన విధానం అస్సలు బాగోలేదనే విమర్శలు వచ్చాయి. అలాగే రామాయణం కథని పూర్తిగా వక్రీకరించి ఇష్టానుసారంగా సినిమాటిక్ లిబర్టీ తీసుకొని 'ఆదిపురుష్' చేశారనే ఆరోపణలు వచ్చాయి. 'ఆదిపురుష్' సినిమాని ప్రేక్షకులు కూడా యాక్సప్ట్ చేయలేదు. దీంతో మూవీ బిగ్గెస్ట్ డిజాస్టర్ గా మారింది. ఈ 'ఆదిపురుష్' సినిమా కారణంగా ప్రభాస్ దారుణమైన ట్రోలింగ్ కి గురయ్యాడు. దీంతో ప్రభాస్ మరోసారి రామాయణం కథ జోలికి వెళ్లడని అందరూ అనుకున్నారు. అయితే డార్లింగ్ ప్రభాస్ మరోసారి 'రామాయణం' లో నటించబోతున్నాడనే ప్రచారం ఇప్పుడు తెరపైకి వచ్చింది. నితీష్ తివారి దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయి పల్లవి జోడీగా 'రామాయణం' మూవీ తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో లార్డ్ పరశురాముడి పాత్ర కోసం ప్రభాస్ ని మేకర్స్ సంప్రదించినట్లు టాక్ వినిపిస్తోంది. పరశురాముడి క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్ గా, గంభీరంగా ఉంటుంది. ఆ క్యారెక్టర్ ని కరెక్ట్ గా చూపించాలంటే మంచి కటౌట్ ఉన్న స్టార్ అయితే బాగుంటుందని ప్రభాస్ ని అడిగారంట. డార్లింగ్ కూడా పరశురాముడి క్యారెక్టర్ చేయడానికి ఒకే చెప్పాడా లేదా అనే విషయంలో ఇంకా సరైన క్లారిటీ అయితే రాలేదు. త్వరలో ఈ క్యారెక్టర్ కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే ఛాన్స్ ఉందని బిటౌన్ లో వినిపిస్తోంది. ఒక వేళ ఈ వార్త నిజమైతే మాత్రం కచ్చితంగా 'రామాయణం' సినిమాకి ఊహించని క్రేజ్ వస్తుంది. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, ప్రభాస్ పరశురాముడిగా, రాకింగ్ స్టార్ యష్ రావణుడి పాత్రలో కనిపిస్తే చూసేందుకు రెండు కళ్ళు సరిపోవు. ముగ్గురు పాన్ ఇండియా స్టార్స్ ఒకే సినిమాలో అంటే దేశ వ్యాప్తంగా ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని ట్రేడ్ పండితులు కూడా అంటున్నారు. అయితే 'రామాయణం' కథను ఒకసారి టచ్ చేసి ట్రోలింగ్ ఎదుర్కొన్న ప్రభాస్ మరోసారి అలాంటి కథలో భాగం అవుతాడో లేదో చూడాలి.